సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం : 27 : జనవరి : 2025



సభావేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, హౌంశాఖ గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

సంక్షేమం దిశగా అడుగులు

- అమల్లోకి కొత్తగా నాలుగు పథకాలు
- ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- మహాలక్ష్మి పథకం కింద బస్సుల్లో 1.49 కోట్ల మంది ప్రయాణం
- జిల్లాలో 85,171 మంది రైతులకు రూ.679 కోట్ల పంట రుణమాఫీ
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ విజయేందిర వెల్లడి

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందని కలెక్టర్ విజయేందిర అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 1.49 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని, దీని ద్వారా మహిళలకు రూ.68.62 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో భాగంగా కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ జానకి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం పోలీస్ కవాతులో భాగంగా పరేడ్ కమాండర్ గౌరవ వందనం సమర్పించిన తర్వాత కలెక్టర్ మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రూ.500లకు ఇవ్వడం జరుగుతుందని, దీని కింద 1.26 లక్షల వినియోగదారులకు 2.26 లక్షల గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. ఇందుకోసం రూ.6.24 కోట్ల సబ్సిడీ వినియోగదారుల ఖాతాలో జమ చేశామన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,29,068 జీరో బిల్లులు జారీ చేశామని, 1,29,068 కుటుంబాలకు కలిపి ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.26.93 కోట్ల సబ్సిడీ వర్తించిందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా 2,52,072 కుటుంబాల వివరాలు సేకరించామన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు.



'రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాం. తద్వారా సంక్షేమం దిశగా అడుగులు పడ్డాయి. జిల్లా అభివృద్ధికి ఇటు అధికార యంత్రాంగం, అటు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పాటుపడాలి. ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిర ఇళ్లు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడం జరుగుతుంది.'

\- కలెక్టర్ విజయేందిర

జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఆయిల్‌పాం తోటల విస్తరణ..

జిల్లాలో రుణమాఫీ కింద అర్హులైన 85,717 మంది రైతులకు రూ.679 కోట్లు రుణమాఫీ అయ్యిందని కలెక్టర్ వివరించారు. రైతు బీమా కింద ప్రమాదవశాత్తు మృతిచెందిన 436 మంది రైతుల నామినీలకు రూ.21.80 కోట్లు అందించామన్నారు. ఆయిల్‌పాం తోటల విస్తరణ పథకం ద్వారా 765.35 ఎకరాలకు 213 మంది రైతులకు పరిపాలన మంజూరు చేశారన్నారు. వానాకాలం సీజన్‌లో 177 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 19,346 మంది రైతుల నుంచి రూ.213.52 కోట్ల విలువ చేసే 92,032 మె.ట., ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 7,924 మంది రైతులకు 39,544 టన్నుల సన్నాలకు సంబంధించి రూ.19.77 కోట్ల బోనస్ చెల్లించామన్నారు.



కలెక్టర్ విజయేందిరకు గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

13,183 మందికి శస్త్రచికిత్సలు

ఆరోగ్యశ్రీ కింద 13,183 మందికి రూ.33.39 కోట్లతో ఉచిత శస్త్రచికిత్స చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది 10,997 కాన్పులు కాగా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 7,093, ప్రైవేట్‌లో 3,904 అయ్యాయన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద 642 పాఠశాలలకు మంచినీటి సదుపాయం, విద్యుత్, టాయిలెట్స్ మరమ్మతు చేశారు.

- జిల్లా వెనకబడిన తరగతుల శాఖ నుంచి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద బీసీ, ఈబీసీ కులాల వారిలో 11,015 విద్యార్థులకు రూ.18.47 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం ఇటీవల ఉర్దూ ఘర్ కోసం రూ.15 కోట్లు, షాదీఖానా, ఇతర పనుల కోసం రూ.25 కోట్లు, శ్మశాన వాటిక ప్రహరీ కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు.
- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో వరద నష్ట నివారణ పనుల కింద రూ.55 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు మంజూరు చేశారు. ఎస్‌డీఎఫ్ కింద 91 కమ్యూనిటీ హాళ్ల నిర్మించడానికి ప్రతిపాదించారు. టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రూ.37.87 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

రోడ్లకు మహర్దశ..

జిల్లాలో సింగిల్ లైన్ రోడ్ల నుంచి డబుల్ లైన్ రోడ్ల కోసం రూ.50 కోట్ల నిధులతో పనులు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు. కురుమూర్తిస్వామి ఆలయానికి రూ.110 కోట్లతో రోడ్లు, ఇతర పనులు మంజూరు చేసిందన్నారు. పరిశ్రమల శాఖ కింద జిల్లాలో 11 మెగా, 53 భారీ, మధ్య తరహా, 2,559 సూక్ష్మ, 241 చిన్నతరహా పరిశ్రమలు మొత్తం రూ.4,346.18 కోట్ల పెట్టుబడితో 28,051 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 2024– 25లో 22,484 వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.45.62 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

రూ.304.87 కోట్ల రుణాలు

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 8,758 స్వయం సహాయక సంఘాలకు రూ.304.87 కోట్ల బ్యాంకుల ద్వారా అందించామని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా శక్తి కింద 1,198 మందికి గేదెల కొనుగోలు, 18 నాటుకోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్త్రీనిధి ద్వారా 848 స్వయం సహాయక సంఘాలకు రూ.23.3 కోట్ల రుణ సదుపాయం, ఉపాధి హామీ కింద ఈ ఏడాది రూ.98.18 కోట్లతో 63 వేల కుటుంబాలకు 29.02 లక్షల పని దినాలు కల్పించామన్నారు.

'అవి మావోయిస్టుల లేఖలు కావు'

జడ్చర్ల: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు తమను బెదిరించేందుకు మావోయిస్టుల పేరుతో లేఖలు రాస్తున్నారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని అనుమానించాలన్న ఉద్దేశంతో లచ్చన్న దళంగా లేఖలో పేర్కొంటున్నారన్నారు. కానీ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి తమకు వచ్చిన లేఖలకు ఎలాంటి సంబంధం లేదని అయితే మొదటిసారి రాసిన లేఖలకు సంబంధించి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోలీసుల విచారణలో నిందితులుగా తేలారన్నారు. ఇక రెండోసారి లేఖలు కూడా బీఆర్‌ఎస్‌కు చెందిన వారి పనే అయి ఉంటుందని అనుమానం ఉందన్నారు. త్వరలోనే అసలు నిందితులు బయటపడతారని, తనతోపాటు కోడ్గల్ గ్రామానికి చెందిన తమ పార్టీకి చెందిన సాయిరెడ్డికి కూడా మావోల పేరుతో లేఖ వచ్చిందన్నారు. లేఖలో పేర్కొన్నట్లు తమ వారి తప్పులు తేలితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లేఖలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

త్వరలో సన్నబియ్యం పంపిణీ



పోతన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోతన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ గ్రామానికి ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు రాలేదని, కానీ, ఈ ఒక్క సంవత్సరంలో 135 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తున్నామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, రేషన్ షాపుల్లో త్వరలో సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. రైతుల నుంచి సేకరించిన సన్న వడ్లను బియ్యంగా మార్చి త్వరలో రేషన్ షాపుల్లో ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలకు అందిస్తామని స్పష్టం చేశారు. భూమి ఉన్న వారికే కాకుండా భూమి లేని నిరుపేదలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో నిర్మిస్తున్న మినీ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. తర్వాత రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి, రూ.2 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్లకు భూమిపూజ, రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ఎంపీడీఓ కరుణశ్రీ, తహసీల్దార్ సుందర్‌రాజ్, టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో 'పాలమూరు' పూర్తి చేశారా..?

- 'పేట– కొడంగల్' ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేకపోయారు
- కేసీఆర్, కేటీఆర్‌లకు సంపదలపై ఉన్నధ్యాస ప్రాజెక్టులపై లేదు
- కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే సీఎం అయ్యా
- 20 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- పరిశ్రమలు నెలకొల్పుతుంటే రాజకీయం చేశారు
- చంద్రవంచలో నూతన పథకాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నారాయణపేట/ కోస్గి: 'పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు– రంగారెడ్డి పూర్తి చేయలేకపోయారు. కనీసం నారాయణపేట– కొడంగల్ ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేదు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయొద్దన్నమా..? సంపదలపైన ఉన్న ధ్యాస కేసీఆర్, కేటీఆర్‌కు ప్రాజెక్టులపై లేకపాయె. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా..రాష్ట్రంలో వారి రాజకీయ మనుగడ ఉండదనే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రాజకీయం చేస్తూ అడ్డుకుంటున్నారు.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి.. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పథకాలను తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీఎం కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మిత్రులారా ఇందిరమ్మ రాజ్యం.. ప్రజాపరిపాలనలో మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని 13 నెలలు పూర్తి కావొస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం.. ఇందుకు వేదికైన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామాన్ని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు.

పరిశ్రమలు తెస్తే అడ్డుకున్నారు..

పరిశ్రమలు తేవాలని కొడంగల్ నియోజకవర్గంలో 1,300 ఎకరాల భూసేకరణ చేస్తే రాజకీయం చేస్తూ అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం ధ్వజమెత్తారు. వెనకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పెట్టుబడులు తీసుకువస్తుంటే అడ్డుకున్నారన్నారు. ఎప్పటికీ మనం వెనకబడే ఉండాలా..? కొడంగల్ యువకులు ఇంకా లుంగీలు కట్టుకొని బస్టాండ్లలో తిరగాలా..? కొడంగల్‌కు మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీలు రావొద్దా..? అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన మనుషులు కొడంగల్ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సొంతంగా రూ.కోట్లు వెచ్చించానని, కోస్గి బస్టాండ్ నిర్మాణానికి తన సొంత స్థలం ఇచ్చానని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలు రాష్ట్రానికి అంకితం ఇస్తున్నాం.. ప్రతి లబ్ధిదారుడికి మార్చి 31 నాటికి పథకాలన్నీ అందుతాయి.. వలస పోయిన కుటుంబాలు కూడా సొంతూరులో రేషన్‌కార్డులు తీసుకోవాలని సీఎం కోరారు. నిండు మనసుతో కొడంగల్ ప్రజలు అండగా నిలబడితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. దేశంలోపు కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మన మాట.. మన బాట.. అభివృద్ధి, సంక్షేమమే అని సీఎం పునరుద్ఘాటించారు.

సీఎం సభ హైలెట్స్

- 2.26 గంటలకు కోస్గి మండలం చంద్రవంచలో స్టేజీ దగ్గర ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలీకాప్టర్ చేరుకుంది.
- 2.32 గంటలకు సభాస్థలికి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 2.34 గంటలకు తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.
- 2.40 గంటలకు సీఎస్ శాంతికుమారి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.
- 2.44 గంటలకు రైతు నర్సప్పకు రైతు భరోసా చెక్కు అందజేత
- 2.46 గంటలకు పార్వతమ్మకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కు అందజేత
- 2.50 గంటలకు రేషన్‌కార్డుల పంపిణీ
- 2.51 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలను అందజేయలేదని గ్రహించిన నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ లబ్ధిదారులను మళ్లీ పిలిపించి సీఎం చేతులమీదుగా అందజేశారు.
- 2.53 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించారు.
- 3.30 గంటలకు వరకు ప్రసంగం ముగిసింది.
- 3.40 గంటలకు తిరిగి హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

అధికారులు ఎప్పుడైనా వచ్చారా..

గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో అధికారులు ఎప్పుడైనా గ్రామాల వైపు చూశారా అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో మూడుసార్లు గ్రామ సభలు నిర్వహిస్తూ గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.

- సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా నాలుగు కొత్త పథకాలను చంద్రవంచలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు పథకాలు అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలు విజయవంతంగా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బేన్ షాలమ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ రామచంద్ర, గ్రంథాలయ చైర్మన్ విజయకుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కోస్గి మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.





కార్యక్రమానికి హాజరైన ప్రజలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన గుర్నాథరెడ్డి తదితరులు

కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే

మీ అందరికీ తెలుసు 2023 వరకు కొడంగల్ నియోజకవర్గం ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా న్యాయం మాత్రం జరగలేదు.. 2023 డిసెంబర్ ఎన్నికల్లో పెద్దలు గుర్నాథరెడ్డి, ప్రజలందరూ ఆలోచించి ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని.. ఆ ప్రభుత్వం నాయకత్వం వహించాలని కష్టపడి అత్యధిక మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు తనను ముఖ్యమంత్రిగా నియమించడం కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్‌కు ఎక్కువ సమయం ఇవ్వలేకపోతున్నానని, కానీ 4 కోట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొడంగల్ అభివృద్ధికి పాటు పడుతున్నానన్నారు. నాలుగు కొత్త పథకాలు కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రారంభమయ్యాయంటే ఎంతో గౌరవంగా ఉందన్నారు.

ఆధార్ మాదిరిగానే రేషన్‌కార్డు

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఎలాగో.. పేదలకు రేషన్ కార్డు అలాగే అని సీఎం పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు వచ్చిందా అంటూ కేసీఆర్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్.. అమెరికాలో కంప్యూటర్ చదువులు చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్నా సోయి ఎందుకు రాలేదని దుయ్యబట్టారు. రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తూ.. ఫిబ్రవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రాజ్యాంగంతోనే సమాన విలువలు



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: రాజ్యాంగం ద్వారా పొందిన స్వతంత్ర, సమానత్వం, సమగ్రత వంటి విలువలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం డీఐజీ కార్యాలయం ఎదుట ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడం వల్ల ప్రజల విశ్వాసాన్ని పొందాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని నేరాలను అడ్డుకోవడంలో ముందుండాలని సూచించారు.

- జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంతోపాటు క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకి జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్పీ జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, సుదర్శన్, పరిపాలన విభాగం సిబ్బంది, ఆర్ఐలు పాల్గొన్నారు.
- జిల్లా ప్రధాన కోర్టు భవన ఆవరణలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. జిల్లా జైలులో సూపరింటెండెంట్ వెంకటేశం జాతీయ జెండాను ఎగువేశారు.

మహబూబ్‌నగర్‌లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మహబూబ్‌నగర్‌లో గ్రామదేవత వేషధారణలో..



గద్వాలలో గిరిజన వేషధారణలో..





నాట్యం చేస్తున్న విద్యార్థులు

రాజ్యాంగ స్ఫూర్తి.. జయహో



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూవాడ త్రివర్ణ శోభితంగా మారాయి. దేశ భక్తి ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలువురు తమ విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. జాతీయ పతాకం చేతబూని జయహో భారత్ అంటూ విన్యాసాలను ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో వివిధ శాఖల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- సాక్షి నెట్‌వర్క్



గద్వాలలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించండంటూ..



మహబూబ్‌నగర్‌లో..



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శకటం ప్రదర్శన



వనపర్తిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ..



మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఏర్పాటుచేసిన శకటం



మహబూబ్‌నగర్‌లో సంప్రదాయ నృత్య ప్రదర్శన

పాలమూరులో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పాలమూరు/ జెడ్పీసెంటర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ మైదానం, కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక, నృత్య, కరాటే ప్రదర్శనలు అలరించాయి. అంతకు ముందు పోలీస్ పరేడ్ మైదానంలో పలు రకాల ప్రభుత్వ శాఖల నుంచి ప్రత్యేక శకటాలు ఏర్పాటు చేశారు. మొదటిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు - డిజిటల్ అరెస్టుల పేరుతో శకటం ఏర్పాటు చేశారు. అయితే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ శకటానికి మొదటి బహుమతి, పోలీస్ శాఖకు రెండో బహుమతి, డీఆర్‌డీఓ శాఖకు మూడో బహుమతి, వ్యవసాయ, అటవీ శాఖలకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. అనంతరం స్వాతంత్ర్య సమర యోధులను కలెక్టర్, ఎమ్మెల్యేలు, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఘనంగా సన్మానించారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కాలిన జాతీయజెండాను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కాలిన త్రివర్ణ పతాకం

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ఎగరవేసిన జాతీయ జెండా టపాసుల నిప్పురవ్వలు పడి కాలిపోయింది. సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయం ముందు నిర్వహించగా కొందరు టపాసులు కాల్చారు. దీంతో వీటి నిప్పురవ్వలు జెండా పడటంతో కాలిపోగా పంచాయతీ సిబ్బంది జెండా తీసివేశారు. జెండా ఉన్న సంగతి తెలిసి కూడా అక్కడ టపాసులు పేల్చడమేమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ జెండాకు అవమానం

- ఆవిష్కరించిన గంటకే నేలకొరిగిన త్రివర్ణ పతాకం



వాల్యాతండా ప్రాథమిక పాఠశాల ఎదుట నేలకొరిగిన జాతీయ జెండా

భూత్పూర్ : గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాకు అవమానం జరిగింది. జెండాను ఆవిష్కరించిన గంటకే త్రివర్ణ పతాకం నేలకొరిగింది. భూత్పూర్ మున్సిపాలిటీలోని వాల్యాతండాలోని ప్రాథమిక పాఠశాల ముందు జాతీయ జెండాను ఎగరవేయడానికి దిమ్మెను సైతం ఏర్పాటు చేయలేదు. గతంలో ఏర్పాటుచేసిన దిమ్మెకు రంధ్రం చేసి వెదురుబొంగు కట్టెకు త్రివర్ణపతాకం, కాగితాలు అంటించి రాళ్లను పెట్టి జెండాను ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జెండా పండుగను జరుపుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. వారంతా వెళ్లిన గంటలోపే జాతీయ జెండా కింద పడిపోయింది. ఉపాధ్యాయుల అలసత్వం కారణంగా త్రివర్ణ పతాకానికి అవమానం జరిగిందని వాల్యాతండా ప్రజలు ఆరోపిస్తున్నారు.



జాతీయ జెండాను తలకిందులుగా..

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం పెద్దరేవల్లి రిపబ్లిక్‌డే సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్, స్పెషల్ ఆఫీసర్ నుమాన్ జాతీయ జెండాను తలకిందులుగా ఎగరవేశారు. జాతీయ జెండాను ఉల్టా ఎగరవేయడంతో అక్కడున్న గ్రామస్తులు నాయకులు ఇదేంటని సంబందిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జెండాను కిందకి దింపి సరిచేసి మళ్లీ ఆవిష్కరించారు.

పెద్దరేవల్లిలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగరేసిన దృశ్యం



కాల్వకు గండి.. నీట మునిగిన పంటలు



తెగిన కాల్వ

మల్దకల్: మండలంలోని చర్లగార్లపాడు శివారులో 106 ప్యాకేజీ కాల్వకు ఆదివారం గండి పడటంతో పంటలు నీట మునిగాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వ షట్టర్‌ను కొందరు రైతులు మూసి వేయడంతో నాగర్‌దొడ్డి, కుర్తిరావులచెర్వు మీదుగా తూంకుంటకు వెళ్లే కాల్వలో నీటి ఉధృతి పెరగడంతో పాటు కాల్వలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వ తెగిపోయింది. నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నీటి సరఫరాను నిలిపి వేశారు. మొత్తం 25 ఎకరాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, పొగాకు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు సుధాకర్, ధర్మన్న, నాగరాజు, ప్రేమ్‌రాజ్, ప్రసాద్, కర్రెన్న, బుడ్డన్న, వెంకటన్న తెలిపారు. నష్ట పరిహారం అందించడంతో పాటు కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

బెబ్బులికి పూర్వవైభవం



శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు ప్రధాన కూడలిలోని ఫారెస్టు డివిజనల్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన పెద్ద పులుల బొమ్మలు ఎట్టకేలకు పూర్వవైభవం సంతరించుకున్నాయి. గత కొన్నాళ్లుగా ఇక్కడి పెద్ద పులుల బొమ్మలు రంగులు వెలిసి కళావిహీనంగా మారిన వైనంపై ఈ నెల 23న 'సాక్షి' దినపత్రికలో 'లక్ష్యం నెరవేరిందో.. నిర్లక్ష్యం ఆవహించిందో' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అటవీ శాఖ అధికారులు పెద్ద పులుల బొమ్మలకు రంగులు వేశారు. దీంతో ఆదివారం గణతంత్ర వేడుకలకు వచ్చిన వారికి నిజమైన పెద్ద పులులా కనిపించి ఆశ్చర్యపరిచాయి.

- మన్ననూర్

సాక్షి ఎఫెక్ట్..

వీధి కుక్కల దాడి

- ఐదుగురు చిన్నారులకు గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులపై ఆదివారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఇందులో స్పందన, నిహాల్, రాంకుమార్, శాన్విక, యస్వికకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు వివరించారు. గ్రామంలో వీధి కుక్కల సంచారం అధికమైందని గ్రామస్తులు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఆదివారం పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి ప్రశంసా పత్రాలు అందజేశారు.

- పాలమూరు



ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు



శంకర్ ఏఓ | సంధ్య ఆర్‌అండ్‌బీ డీఈ | శ్రీనివాస్ డీపీఆర్‌ఓ | వేణుగోపాల్ ఉద్యానవన అధికారి



బాలమణి మార్కెట్ యార్డ్ డీఏం | మహేశ్వర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ | ఏసియా ఆర్‌అండ్‌బీ ఈఈ | నరేందర్‌రెడ్డి పంచాయతీ రాజ్ ఈఈ



పార్థసారథి డీపీఓ | నవీన్ ఆర్‌డీఓ | వెంకట్‌రెడ్డి జెడ్పీ సీఈఓ | సత్యనారాయణ అటవీ శాఖ అధికారి | రవికుమార్ డీఆర్‌ఓ | విశ్వనాథ్ మున్సిపల్ జవాన్ | శైలజ ఉమెన్ ఎస్‌ఐ | అరుణ ఉమెన్ ఎస్‌ఐ



చిన్న మద్దిలేటి ఏఆర్ ఎస్‌ఐ | వెంకటయ్య కానిస్టేబుల్ | సుదర్శన్ వర్టికల్ డీఎస్పీ | అప్పయ్య వన్‌టౌన్ సీఐ | గోపాల్ సైబర్ క్రైం సీఐ | నగేష్ ఏఆర్ ఆర్‌ఐ | శ్రీనివాస్ అడ్డాకుల ఎస్‌ఐ | ఎండీ. హసన్ ఏఆర్ ఎస్‌ఐ

గజ వాహనంపై అభయాంజనేయుడు



ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. రెండోరోజు ఆదివారం ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గజవాహన సేవ నిర్వహించారు. భక్తుల భజనల నడుమ స్వామివారు గజ వాహనంపై ఊరేగించారు.

రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామ శివారులో నిర్మిస్తున్న భారత్‌మాల రోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. బింగుదొడ్డి సమీపంలోని చెరువులో భారత్‌మాల రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్.. మట్టిని తరలించారని తెలిపారు. గ్రామంలో పాఠశాల భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పటి వరకు సగం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు పూర్తిచేసిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.